# సహజీవనం

వసంత చదువునుగురించి, ఆ రోజున ఇంటిల్లిపాదీ, యజ్ఞంచేసినంత హంగామాచేశారు. వసంతేమో, ఆరు నూరయినా, నూరు ఆరయినా, తను బ్రహ్మదేవుణ్ని గూడా లెక్క చెయ్యనని ఖండితంగా చెప్పేసింది. ఆ సమాధానం విన్నాక సూర్నారాయణకు అరికాలిమంట కాస్తా నెత్తి కెక్కి కూచుంది!

"ఏం, చదువుకొని, నువ్వు ఉద్యోగాలు చెయ్య బోతావా ? ఊళ్లేలబోతావా ? వండటానికీ, పిల్లల్నికన టానికీ, నీ చదువేమీ పనికిరాదే !" అన్నాడు సూర్నారా యణ, తను చెల్లెలితో మాట్లాడుతున్న సంగతినిగూడా మరిచిపోయి.

"చదువుకోడం అందుకేనన్న సంగతి నాకింకా తెలీదే!" అన్నది వసంత.

తన సమాధానంలోని బలహీనత ఆమెకు తెలిసి పోతూనే ఉంది. అంతకన్నా గట్టి జవాబేదో ఇవ్వాలని ఆమె ఆత్మ ఘోషించిపోతూఉంది! కానీ, ఆత్మలు ఘోషించి నప్పుడల్లా మనస్సులు సజావుగా పనిచెయ్యవు మరి!

"చదువుకో నమ్మాయిలకు మొగుళ్ళు దొరకడమే బ్రహ్మప్రళయంగా ఉందిగదా, చదువుకొన్నవారి మాటే మిటి? ఇప్పటికే నీ మొఖాన పదివేలు పోస్తేనేగానీ నీకు మొగుడనేవాడు రాడు. నువ్వా బియ్యే ప్యాసయితే—"

"ఆ అవసరమే ఉండకపోవచ్చు," అన్నది వసంత, ఏ మాత్రమో దెబ్బతిని. "ఎందుకురా అన్నయ్యా ఆ కడుపు మంట! అసలు సంగతేమిటో కక్కరాదా? నా చదువుమీదా, సినిమాలమీదా పడి యాడవటం దేనికి? నిన్ను గురించి నేనెప్పుడూ అట్లా అనలేదు. కనీసం ఆలోచించనుకూడా లేదు. ఇంత చవకబారు ఉద్దేశాలున్నవాళ్ళంటే నాకసహ్యం."

"దానివల్ల నష్టమేమీలేదుగానీ, నీ చదువుకింద ఇంకా కొంతపెట్టుబడి పెట్టడంమాత్రం నాకిష్టంలేదు... నువ్వు మాట్లాడకు వసంతా!—"

అని ఏదో అనబోయి, అనకుండానే వెళ్ళిపోయాడు సూర్నారాయణ.

ఈ యజ్ఞం ఈరోజే మొదలవలేదు. వసంత ప్రైవేటుకు వెళ్ళడంసాగించిన రెండోవారంనుండీ ప్రారంభమయింది. దీన్ని ప్రారంభించిన కీర్తి లక్ష్మి దక్కించుకొంది.

లక్ష్మికి ఆడబిడ్డంటే కోపంగానీ, అసూయగానీ ఉంటుందనుకోకేం! కావటానికి ఆవిడకూడా ఇంతోఅంతో ఇంగ్లీషు చదువులు చదివిందే! ఆడవాళ్ళు ఏ విషయంలోనూ, మగవాళ్ళకు తీసిపోరాదనీ, ఆడవాళ్ళు బాగా చదువుకొని, బాగా ఉద్యోగాలు చెయ్యాలనే గొప్ప గొప్ప భావాలు, లక్ష్మి కాలేజీరోజుల్లోనే అలవరచుకొంది. ఈవిషయంమీద జరిగిన డిబేటింగ్‌లో పాల్గొని లక్ష్మిశాస్త్రి ఏదోబహుమానం కూడా కొట్టేసింది! అయితేనేం, వసంత చదువును ప్రతిఘటిస్తున్నవారిలో లక్ష్మిదే అగ్రతాంబూలం!

అందుకు లక్ష్మిచెప్పే కారణాలు, పైకి చాలా

ఉన్నాయి. అవేవీ నిజానికి బలంగా లేవు. అసలు కారణమేమిటో ఆవిడభర్తకొక్కడికే చూచాయగా చెప్పింది!

"ఛా! నోరు ముయ్ ఇడియట్!" అన్నాడు. నూన్నారాయణ చాలా ముద్దుగా.

"నా నోరైతే మూసుకొంటాను గానీ, అందరి నోళ్లూ మూయడం నాకు చాతకాదే! మీకయినా ఆ పని చాతవుతుందని నే ననుకోలేను!" అన్నది లక్ష్మి.

అప్పటికీ నూన్నారాయణ అంతరాత్మ భార్య చెప్పిందాన్ని ఒప్పుకోలేదు.

"మిమ్మల్ని నమ్మమని నే ననడంలేదు. నేను విన్నదేమిటో చెప్పాను. నిజాన్ని వినే ధైర్యంలేకపోతే నమ్మడం మానేయండి. అంతేగానీ —" అన్నది లక్ష్మి.

"నిజమేనంటే!" అంటూ మళ్ళీ ఆశ్చర్యాన్ని ప్రకటించాడు నూన్నారాయణ.

"అయ్యో! నారాత!!" అని తల కొట్టుకొంది లక్ష్మి. "మీ చెల్లెలిమీద నాకేమన్నా కోపమటండీ, అబద్ధాలు చెప్పడానికి? ఊరంతా కోడై కూస్తున్నా మీకు తెలియదాయె. చెబుతూంటేనేమో వినిపించుకోరాయె. పైగా నేనేదో అబద్ధాలాడుతున్నానని, నన్నుమానిస్తున్నారాయె. ఈ ముదనష్టపు సంగతి నలుగురికీ తెలిస్తే ఇంకేమన్నా ఉందా? వసంతకు పెళ్ళి పెటాకులూ అవుతాయా?"

అప్పణ్ణించీ ఈ గొడవ జరుగుతూనే ఉంది. నూన్నారాయణ రోజూ ఈ యజ్ఞం చేస్తూనే ఉన్నాడు. లక్ష్మి యథాశక్తి ఓ సమిధ వేస్తూనే ఉన్నది!

ఆ రోజున అమీ, తుమీ తేల్చాలనుకొన్నాడు సూర్నారాయణ. కానీ, ఏమీ తేలలేదు. పరీక్షలు ఇంకో నెలరోజు లున్నాయనగా చదువు మానడంలో అర్థంలేద న్నాడు నాన్న. అది నీలాగా పాట్టలకింద పాసు కాలేదనీ, నీకన్నా తెలివైందనీ, దాని చదువుగొడవలో కలిగించుకో వద్దనీ, నాన్న గట్టిగా అన్నాడు.

అసలు సంగతేమిటో నాన్నకు చెబుదామనుకు న్నాడు సూర్నారాయణ. కానీ, వసంతనుగురించి ఏం చెప్పినా ఆయన వినిపించుకొనేటట్టు లేడు. అది చదువుకోడం ఇష్టంలేక, ఇలాంటికుళ్ళంతా బైటపెట్టుకుంటున్నావని అన్నా అంటాడు. కోపంవస్తే ఆయన బొత్తిగా మనిషికాడు.

నిజానికి, వసంత చదువుకొంటున్నదన్న ఏడుపు సూర్నారాయణకు ఏకోశానా లేదు. అసలు దాన్ని చదివించాలని మొదట్లో పట్టుబట్టిందిగూడా సూర్నారాయణే! కానీ, ఆ భడవా చదువుపేరు చెప్పి ఇంకా చాలా "పాడుపన్లు" చేస్తూఉంది. తను చదువుకోవటానికయితే వొప్పుకొంటాడుగానీ, పాడుపనులు చెయ్యటానికి ఛస్తే వొప్పుకోడు. సంస్కారంపేరుతో నీతి విలవల్ని చంపేయడం సూర్నారాయణకు అసలే గిట్టదు.

"అమ్మాయిగారి రంకుతనాన్ని అందరూ ఆమోదించినట్టుందే!" అన్నది లక్ష్మి ఆ రాత్రి మొగుడికి తమలపాకు లందిస్తూ.

సూర్నారాయణ సాచి లెంపకాయ కొడదామను

కొనిగూడా, రాబోయేఫలితాన్ని ఊహించి ఆగిపోయినటు వంటివాడైనాడు.

"ఆట్టే పిచ్చిగా వాగకు. బజారుముండలన్న మాట లన్నీ పట్టుకుని, నాదాకా మోసుకురానవసరంలేదు. నువ్వే వాళ్ళకు గట్టిగా చెప్పి ఉండొచ్చునే" అన్నాడు, ఆట్టే కోపంలేకుండా, తగుమాత్రం గొంతుపెంచి.

లక్ష్మి మొగుడి మొఖంలోకి క్షణకాలం చూసి ఫక్కున నవ్వింది.

సూన్నారాయణ, ఆ చూపుకు జావలా అయి పొయ్యాడు.

"నా మాటమీద మీ కంత నమ్మకంలేనప్పుడు—"

"అనేది లేనేలేదు. నలుగురు అనుకొనేదేదో నువ్వం టున్నమాట నిజమే! కానీ, వాళ్ళు నిజమే అంటున్నారనే రుజువులేదే!" అన్నాడు సూన్నారాయణ.

లక్ష్మి మరోమాట లేకుండా వెళ్ళి మంచంమీద పండుకొంది.

"నీకయినా ఆ విషయం రూఢిగా తెలిస్తే అనుకో వచ్చు. అల్లాయి లిల్లాయి మాటలు పట్టుకొని, ఇదేకాదు - దేన్నీ మనం తేల్చుకోలేం. ఏమంటావ్?"

లక్ష్మి ఏమీ అనలేదు.

కానీ, ఆ మర్నాడే ఆవిడ రూఢి చేసుకోదలంచింది. నిప్పులేందే పొగరాదన్న సంగతి లక్ష్మికి తెలుసు. కానీ, సూన్నారాయణకే తెలీదు.

మామూలుగా అయిదున్నరకల్లా పుస్తకాలు పట్టు

కొని, వసంత బయలుదేరింది. ఆవిడ వెనకనే లక్ష్మి కూడా బయల్దేరింది. భార్యాభర్తలు రాత్రే అనుకొన్నారు గనక, సూన్నారాయణ ఆఫీసునించి రాగానే లక్ష్మికోసం వెదక లేదు. తల్లితో సినిమాకెళ్ళిందని బొంకాడు.

తొమ్మిదిగంటలకల్లా వసంతా లక్ష్మి కలిసేవచ్చారు. సూన్నారాయణ గుండెలు దడదడలాడాయి. లక్ష్మి మొగాన చిరునవ్వున్నది! ఆ నవ్వు దేనికిగుర్తు?

"ఏమయింది?" అన్నాడు సూన్నారాయణ చెవ లల్లో ప్రాణాలుపెట్టుకొని.

"ఆఁ నా మొఖం!" అన్నది లక్ష్మి సన్నగా నవ్వుతూ.

సూన్నారాయణ కేమీ పాలుపోలేదు.

"మంది మాటలువిని మనువుకెళ్ళి నట్టయింది నాపని! ఛాఛాఛా! ఏంమనుషులండీ వీళ్ళు! ఇదిగో పులిఅంటే, అదుగో తోకా అంటారు" అన్నది లక్ష్మి.

సూన్నారాయణ గట్టిగా గాలి వొదిలాడు.

"నే చెప్పలేదుటే, దేనికైనా రుజువు కావాలని!"

"మరే! రాత్రేమో అనుకొన్నాను గానీ, మీరట్లా రుజువు కావాలనడమే మంచిదయింది. ఈపూట వసంతతో నేనూ వెళ్ళాను. ఆ రాజారావుగారెంత మంచివారని! ఎంత బాగా పాఠాలు చెబుతారని!" అన్నది లక్ష్మి, సూన్నా రాయణను గట్టిగా కావిలించుకొని- మెడమీద ముద్దుపెట్టు కొంటో.